సాక్షి
శ్రీకాకుళం
శనివారం । 26 । జూలై । 2025



అమలు మైనస్

హైస్కూల్ ప్లస్ కాలేజీలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఫలితంగా విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

- 8లో



ఘనంగా వరలక్ష్మీ వ్రతాలు

జలుమూరు: శ్రీముఖలింగంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి నూతన వస్త్రాలు, పిండి వంటలు సమర్పించి మొక్కులు తీర్చారు.

మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ

రణస్థలం: యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఎచ్చెర్లలో ఆగస్టు 4వ తేదీ నుంచి జిల్లాలోని మహిళల కోసం టైలరింగ్‌లో 30 రోజులు ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయని సంస్థ డైరెక్టర్ రామ్‌జీ తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఎమ్మార్వో ఆఫీస్ రోడ్, ఎచ్చెర్ల, శ్రీకాకుళం జిల్లా ఫోన్ నంబర్లు 7993340407, 9553410809ను సంప్రదించాలని కోరారు.

న్యూస్‌రీల్

నేడు వైఎస్సార్‌సీపీ కీలక సమావేశం



ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: శ్రీకాకుళం సమీపంలోని పాత్రునివలస జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కీలక సమావేశం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. జిల్లాలో పార్టీ నిర్మాణం, రీకాలింగ్ చంద్రబాబు, ఇంటింటి ప్రచార కార్యక్రమాల పురోగతిపై సమీక్ష ఉంటుందని తెలిపారు. అలాగే గ్రామ కమిటీల ఏర్పాటుపై సమీక్ష ఉంటుందన్నారు. సమావేశానికి పార్టీ శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులు కుంభా రవిబాబు ముఖ్య అతిథిగా హాజరవుతారని అన్నారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు.

వ్యవసాయాధికారులపై కలెక్టర్ సీరియస్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): జిల్లాలో ఎరువుల కొరత ఉందని, ప్రతి గ్రామంలో రైతులు ఇబ్బంది పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వ్యవసాయాధికారులపై సీరియస్ అయ్యారు. శ్రీకాకుళం అంబేడ్కర్ ఆడిటోరియంలో వ్యవసాయ సంచాలకులు, వ్యవసాయ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, సొసైటీ ప్యాక్ సీఈఓలతో జిల్లాస్థాయి సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. కలెక్టరేట్‌లో ఎరువులకు సంబంధించిన ఫిర్యాదుల కోసం కాల్ సెంటర్ ఏర్పాటుచేశామని ప్రతి ఒక్క రైతుకు తెలియజేయాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా ఉద్యోగాలు చేయడం మంచిది కాదని, రైతులకు ఇబ్బంది కలిగితే సంబంధిత అధికారులపై వేటు తప్పదన్నారు. జిల్లా వ్యవసాయాధికారి వద్ద సమగ్ర సమాచారం లేకపోవడం, అడిగిన దానికి సరైన సమాధానం చెప్పకపోవడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్లాట్ ప్రకారం కూపన్ పద్ధతిలో సరఫరా చేసే తేదీ, సమయం తెలియజేయాలన్నారు.

దాడుల టాస్క్.. ఎస్పీదే ఆ ఫోర్స్!



- పేకాట శిబిరాల జోలికి వెళ్లని లా అండ్ ఆర్డర్ పోలీసులు
- చూసీ చూడనట్లు వదిలేస్తున్నట్లు వైనం
- ఎస్పీ దృష్టికి పేకాట సమాచారం
- టాస్క్‌ఫోర్స్ పోలీసులతో గుట్టుగా దాడులు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

జిల్లాలో మూడు ముక్కలాట జోరుగా సాగుతోంది. పోలీసులు నిరంతరం దాడులు చేసి పట్టుకుంటున్నా శిబిరాలు మాత్రం ఎక్కడికక్కడ కనిపిస్తూనే ఉన్నాయి. దీనికి ప్రధాన కారణం ఆ పరిధిలో లా అండ్ ఆర్డర్ పోలీసులేనని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏ చిన్న నేరం జరిగినా, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా ముందుగా ఆ వాసన పసిగట్టేది ఆ పరిధి పోలీస్‌స్టేషన్ సిబ్బంది, అధికారులే. కానీ గ్యాంబ్లింగ్, బెట్టింగ్ వంటి అంశాలపై స్పష్టమైన సమాచారం ఉండి కూడా చూసీ చూడనట్లు వదిలేయడం విస్మయపరుస్తోంది. లా అండ్ ఆర్డర్ పోలీసుల తీరు, ఉదాసీన వైఖరి చూసి ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి స్వయంగా తానే రంగంలోకి దిగారు. తనకు తెలియవచ్చే సమాచారంతో గుట్టుగా జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసు బృందంతో అనుమానం ఉన్న ప్రతి చోట దాడులు చేయిస్తున్నారు.

గత ఏడాది అక్టోబరు నుంచి ఇప్పటివరకు చూసుకుంటే టాస్క్‌ఫోర్స్ పోలీసులు సుమారు 90 రైడ్‌లు చేశారు. రూ.32.17 లక్షలు స్వాధీనం చేసుకుని ఆ పరిధి స్టేషన్లకు అప్పగించి కేసులు నమోదు చేయించారు. కేసులు వరకే కాకుండా పలుమార్లు పట్టుబడేవారిపై గట్టిగా చార్జిషీట్లు వేయించి మరీ జైలు శిక్ష పడేలా చేయిస్తున్నారు. ఇటీవల ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధి, రూరల్ పీఎస్, ఎచ్చెర్ల, పాతపట్నం పరిధిలో పలువురికి శిక్షలు కూడా పడ్డాయి.

ఎవరిపైనైనా 'ఫోర్స్'గానే ఉంటారు..

ఇటీవల టాస్క్‌ఫోర్స్ పోలీసులకు పట్టుబడినవారిలో గతంలో పేకాట నిర్వహించి అనతికాలంలోనే రూ. కోట్లు ఆర్జించినవారూ ఉన్నారు. రాజకీయ పార్టీల నాయకులు, బడా రియల్‌ఎస్టేట్ వ్యాపారులు, ప్రముఖులు సైతం ఉన్నారు. వచ్చేవాళ్లు సివిల్ పోలీసులని కాళ్లా వేళ్లా పడి రాజకీయ సిఫార్సులతో మీకు నచ్చిన చోట వేస్తామంటూ ప్రగల్భాలు పలికినా వీరి దగ్గర ఆ పప్పులు ఉడకడం లేదు. నేరుగా ఎస్పీకి సమాచారం.. ఆ తర్వాత ఆ పరిధి స్టేషన్లకు సమాచారం ఇచ్చి లెక్క ప్రకారం అప్పజెప్పుతుండటంతో పట్టుబడేవారు తప్పించుకోవడానికి వీలుచిక్కడం లేదు. జిల్లాలో అత్యధికంగా జేఆర్ పురం సర్కిల్ ఎచ్చెర్ల, లావేరు పరిధిలో పేకాట శిబిరాలు ఎక్కువగా నడుస్తున్నాయన్న టాక్ ఉంది. తర్వాతి స్థానంలో నరసన్నపేట సర్కిల్, ఆమదాలవలస సర్కిల్ టౌన్ పరిధి, శ్రీకాకుళం నగరంతో పాటు రూరల్, గార పీఎస్‌లు ఉంటాయని పోలీసుల గణాంకాలే చెబుతున్నాయి. ఇటీవల పాతపట్నంలో జోరందుకున్నాయి.

రూటు మార్చిన ఆటగాళ్లు

- పేకాట శిబిరాలపై ఎస్పీ మహేశ్వరరెడ్డి ప్రత్యేకంగా దృష్టిపెట్టడం.. టాస్క్‌ఫోర్స్ దాడులు చేయిస్తుండటంతో జిల్లాలోని ప్రముఖ నగర కేంద్రాల్లోని జూదరులు రూటుమార్చారు. ఒడిశాలోని పర్లాఖిముడి ఎంట్రన్స్ ఆర్చి వద్ద ఇటీవల ప్రారంభమైన పేకాట క్లబ్‌కు జిల్లాకేంద్రం నుంచి పలువురు వెళ్తున్నట్లు సమాచారం. రామలక్ష్మణ జంక్షన్ వద్ద రెండు కార్లు రెగ్యులర్‌గా ఉంటాయి. ఆదివారంతా అందులో వెళ్తుంటారు. నగరంలోని ఓ ప్రముఖ వైద్యుడు, రాజకీయ నాయకుడు గతంలో ఎచ్చెర్ల పరిధిలో ఉన్న తన గెస్ట్‌హౌస్‌లో పలువురితో ఆడుతూ పోలీసులకు పట్టుబడినా తప్పించుకున్న సంగతి తెలిసిందే. అయినప్పటికీ తనకిష్టమైన జూదక్రీడను వదిలిపెట్టేందుకు మన సాప్పడు ఆ ఆటగాడికి. ఏకంగా విశాఖపట్నంలోని రూ.7లక్షల మినిమం ఎంట్రీ ఫీజుతో ఓ క్లబ్‌లో మెంబర్‌షిప్ పొంది మరీ ఆడుతుంటాడు. తనతో పాటు మరికొందరు స్నేహితులతో వారంలో నాలుగైదు రోజులు అక్కడే గడుపుతారు.
- ఎచ్చెర్ల మండల పరిధి తోటల్లో పేకాట ఆడుతున్న కొందరిని పోలీసులు పట్టుకోవడానికి వెళ్తే అక్కడ గేమింగ్‌లో ఉన్న రెండోపట్టణ రౌడీషీటర్ పోలీసులను తోసుకుంటూ మరీ వెళ్లిపోయాడు.
- ఇటీవల నగరానికి చెందిన టీడీపీ నాయకుడు తన స్వగృహంలోనే కొంతమందితో కలసి పేకాట ఆడుతూ పట్టుబడ్డాడు.
- రూరల్ పరిధిలో సిటీ ఔట్‌కట్స్, కల్యాణ మండపాలు, రామిగెడ్డ తదితర ప్రాంతాల్లో నిన్న మొన్నటి వరకు ముడుపుల మాయలో పడిన కీలక పోలీసు అధికారి కనుసన్నల్లోనే పేకాట శిబిరాలు నడిచాయి. ఎస్పీ దృష్టికి వెళ్లి టాస్క్‌ఫోర్స్ దాడులు చేయించడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఇప్పుడిప్పుడే కేసులు నమోదు చేస్తున్నారు.

ముడుపులు, రాజకీయ ఒత్తిళ్లతో..

జిల్లాలోని పలు స్టేషన్లకు చెందిన పోలీసులు ప్రధానంగా మూడు అంశాలకు లోబడి పేకాట శిబిరాలపై దాడులు చేయలేకపోతున్నారనే చర్చలు సాగుతున్నాయి. రాజకీయ పైరవీల మాటున పోస్టింగులు దక్కించుకుని, అధికార పార్టీనాయకుల ఒత్తిళ్లతో పట్టుకున్న వారిని వదిలేసిన వారు కొందరైతే.. నెలవారీ రూ.లక్షల్లో స్టేషన్‌కు అందే ముడుపుల మాయలో పడి చూసీ చూడనట్లు వ్యవహరించేవారు మరి కొందరుంటున్నారు..అంతే కాక వివిధ పెండింగ్ కేసులతో సతమతమై గ్యాంబ్లింగ్‌పై పెద్దగా దృష్టి పెట్టని అధికారులు సైతం ఉన్నారు.

గళమెత్తిన పెన్షనర్లు



సూర్యమహల్ కూడలిలో మానవహారం



చెత్త బండి పక్కనే ఉండడంతో వాసన భరించలేక ముక్కుమూసుకుంటున్న పెన్షనర్లు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఇటీవల కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక బిల్లుతో పాటు ప్రవేశపెట్టిన పెన్షన్ వాలిడేషన్ రూల్స్ తక్షణమే రద్దు చేయాలని ఫోరం ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కన్వీనర్లు కె.ఎస్ ప్రసాద్‌రావు, కె.చంద్రశేఖర్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఫోరం ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆలిండియా పిలుపు మేరకు శ్రీకాకుళం నగరంలో సూర్యమహల్ కూడలి వద్ద మానవహారం ర్యాలీ నిర్వహించారు. రిటైర్‌మెంట్ తేదీల ప్రాతిపదికన పెన్షనర్ల మధ్య వివక్షతో కూడిన పెన్షన్ సవరణలు ప్రతిపాదనను విరమించాలన్నారు.

ఇచ్ఛాపురం సబ్ పోస్టాఫీస్‌లో భారీ స్కామ్

- 33 ఖాతాల నుంచి రూ.2.86 కోట్ల నగదు మాయం
- ఐదుగురు సస్పెన్షన్



పోస్టాఫీస్‌లో దర్యాప్తు చేస్తున్న పోస్టల్ ఇన్‌స్పెక్టర్లు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం సబ్ పోస్టాఫీసులో భారీ స్కామ్ వెలుగు చూసింది. ఇక్కడ 33 ఖాతాల నుంచి రూ.2.86 కోట్లను పోస్టల్ సిబ్బంది, సహాయకులు కలిసి కాజేసిన వైనం విస్మయం కలిగించింది. ఈ మేరకు శుక్రవారం సోంపేట పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రీకాంత్, శ్రీకాకుళం ఈస్ట్ సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కమల్‌హాసన్ ఇచ్ఛాపురం పోస్టాఫీసులో కొందరు ఖాతాదారులతో మాట్లాడారు. అందరి డబ్బు తిరిగి వస్తుందని భరోసా ఇచ్చారు. పూర్తి వివరాల్లోకి వెళితే.. ఈ నెల 7వ తేదీన ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఇచ్ఛాపురం పోస్టాఫీస్‌లో ఆన్‌లైన్‌లో అవకతవకలు జరిగాయని పైఅధికారులకు ఓ ఫిర్యాదు వెళ్లింది. దీనిపై వారు దర్యాప్తు నిర్వహించగా గత డిసెంబర్‌లో 33 ఖాతాల నుంచి రూ.2.86 కోట్లు కాజేసినట్లు తేలింది. దీంతో శుక్రవారం సోంపేట పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రీకాంత్, శ్రీకాకుళం ఈస్ట్ సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కమల్‌హాసన్ ఇచ్ఛాపురం పోస్టాఫీసుకు వచ్చారు. కొంతమంది ఖాతాదారులను పిలిపించుకుని మాట్లాడారు. ఖాతాదారులకు సంబంధం లేకుండా వారి అకౌంట్లు క్లోజ్ చేసి డబ్బులు తీసుకున్నట్లు గుర్తించారు. వీరిలో ఎక్కువగా కిసాన్ వికాస్ పత్ర్ ఫిక్స్‌డ్ డిపాజిట్లను క్లోజ్‌చేసినట్లు తెలుసుకున్నారు. ఈ స్కామ్‌లో 14 మంది అనుమానితులుగా ఉన్నారని, వారిలో ఐదుగురిని సస్పెండ్ చేస్తున్నామని తెలిపారు. ఉన్నత స్థాయి దర్యాప్తు జరుగుతుందని, ఖాతాదారులకు వారు కట్టిన ప్రతి పైసా కూడా అందుతుందని చెప్పారు.

తురకపేట సమీపంలో మునిగిపోయిన వరిపొలాలు




800 ఎకరాల్లో వరి పంట ముంపు

సరుబుజ్జిలి: అల్పపీడన ప్రభావానికి కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు కిందకు ప్రవహిస్తుండడంతో శుక్రవారం బుడ్డివలస, తెలికిపెంట, పాతపాడు, అగ్రహారం, శాస్త్రులపేట, వీరమల్లిపేట, తురకపేట, వీరభద్రాపురం గ్రామాల్లో గల లోతట్టు ప్రాంతాలకు చెందిన సుమారు 800 ఎకరాల వరి పంట పొలాలు ముంపు బారిన పడ్డాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువులు కబ్జా చేయడం వల్ల ఇలా వరద నీరు పొలాల మీదకు వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

టెక్కలిలో గంజాయి పట్టివేత

టెక్కలి రూరల్: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న గంజాయిని ఎస్పీ కార్యాలయ పరిధి ప్రత్యేక పోలీసు బృందం పట్టుకుని టెక్కలి పోలీసులకు అప్పగించినట్లు స్థానికులు తెలిపారు. గుణుపూర్ నుంచి టెక్కలి వైపు వచ్చే రైల్లో ఒడిశాకు చెందిన కొందరు వ్యక్తులు అక్రమంగా గంజాయిని తరలిస్తుండగా సమాచారం మేరకు ప్రత్యేక బృందం తనిఖీలు నిర్వహించి గంజాయిని స్వాధీనం చేసుకుని, గంజాయి తరలిస్తున్న ఇద్దరు మహిళలతో పాటు ఒక వ్యక్తిని అదుపులో తీసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనలో సుమారు 20 కిలోలకు పైబడి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అయితే ఈ విషయంపై టెక్కలి సీఐ ఎ.విజయ్‌కుమార్‌ను వివరణ కోరగా గంజాయి స్వాధీనం చేసుకున్న విషయం వాస్తవమేనని, దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి వివరాలు వెల్లడించనున్నట్లు ఆయన తెలిపారు.

వినుడు వినుడీ విజయ్ గాథ



నేడు కార్గిల్ విజయ్ దివస్



యుద్ధ వీరుల గుండె చప్పుడు

ఎముకలు కొరికే చలి, దుర్భేధ్యమైన కొండల్లో ప్రయాణం, ఆగని గుళ్ల వర్షం.. కార్గిల్ యుద్ధం గురించి ఇలాంటి సాహసాలను దేశం కథలు కథలుగా చెప్పుకుంటోంది. పాతికేళ్ల తర్వాత కూడా ఆ విజయ గాథలు నేటి యువత నరనరాలను ఉత్తేజితం చేస్తున్నాయి. పాకిస్తాన్‌ను ఉక్కు పిడికిలిలో బంధించి మట్టి కరిపించిన ఈ యుద్ధంలో 300 మంది సిక్కోలు ముద్దుబిడ్డలు కూడా పోరాడారు. ఇందులో పోలాకి మండలం రామయ్యవలస గ్రామంలోని చింతాడ మోహనరావు వీరమరణం పొందగా, మరో ఇద్దరు సైనికులు ముష్కరులను మట్టుబెట్టే ప్రయత్నంలో క్షతగాత్రులయ్యారు. ఆనాటి యుద్ధగాథను వారు ఇలా గుర్తు చేసుకున్నారు.

– శ్రీకాకుళం న్యూకాలనీ

72 గంటలు ఫైరింగ్ ఆపలేదు..



పేరు: చిన్ని సింహాచలం,
స్వస్థలం: లక్కుపురం, బూర్జ మండలం
సైన్యంలో హోదా: హవల్దార్

అది 1999 మే 25. శ్రీనగర్ సమీపంలో 1889 ఎల్డీ రెజిమెంట్ డ్యూటీలో ఉన్నా. మరుసటి రోజు ఉదయాన్నే కార్గిల్ వైపు బయల్దేరాలని హయ్యర్ కమాండ్ నుంచి సమాచారం వచ్చింది. దీంతో అంతా ముందుకు కదిలాం. శత్రుమూకలు కొండపైనుంచి గుళ్ల వర్షం కురిపిస్తూనే ఉన్నాయి. మే 31 నాటికి ప్రతికూల పరిస్థితుల్లో టోలోలింగ్ పర్వత ప్రాంతానికి చేరుకున్నాం. వేసవి కాలం అయినా విపరీతమైన చలి. 421 కేజీల బరువైన 121 ఎంఎంగన్‌ను ఐదుగురు సభ్యులం చొప్పున మోసుకుంటూ.. ఫైరింగ్ చేస్తూ ముందుకుసాగాం. దాదాపు 72 గంటలు ఫైరింగ్ ఆపలేదు. గుళ్ల వర్షం కురుస్తూనే ఉంది. బాంబుల మోతతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లుతోంది. అలా రోజులు గడుస్తూ జూన్ 12 మొదటి విజయం దక్కింది. ద్రాస్ సెక్టార్‌లోని టోలోలింగ్ పర్వత ప్రాంతం భారత సైన్యం ఆధీనంలోకి వచ్చింది. కీలక ప్రాంతం స్వాధీనం కావడంతో విజయోత్సాహంతో ముందుకు కదిలాం. అదే రోజు రాత్రి 8.30 గంటల ప్రాంతంలో ఉన్నట్టుండి పెద్ద కుదుపు. నా కుడి చేతికి తీవ్రగాయాలయ్యాయి. విపరీతంగా రక్తం పోతోంది. అయినా వెరవకుండా ముందుకు సాగాను. నా పరిస్థితి గమనించిన ఉన్నతాధికారులు అదే రోజు రాత్రి చికిత్స కోసం హెలీకాప్టర్‌లో ఆర్మీ బేస్ ఆస్పత్రికి తరలించారు. ఉదయం శస్త్రచికిత్స జరిగింది. మూడు రోజుల తర్వాత విమానంలో చండీగఢ్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ 12 రోజులు ఉన్నాను. అనంతరం విశాఖపట్నంలోని ఐఎస్‌హెచ్ కల్యాణిలో వారం ఉండి అనంతరం ఊరికి వచ్చాను. అక్కడకు కొద్ది రోజుల విశ్రాంతి తర్వాత విధుల్లో చేరాను. ఓపీ స్టార్ మెడల్‌ను ప్రభుత్వం అందజేసింది. 1995 అక్టోబర్ 31న సైన్యంలో విధుల్లో చేరి.. 2014 ఆగస్టు 1న పదవీవిరమణ చేశాను.

టైగర్ హిల్స్‌లో శత్రుమూకలతో..



పేరు: తొంప నీలాచలం
స్వగ్రామం: కేసిపురం, మందస మండలం
సైన్యంలో హోదా: హవల్దార్

నేను 28వ రాష్ట్రీయ రైఫిల్స్ (జమ్ము కశ్మీర్)లో విధుల్లో ఉండేవాడిని. 1999 మే 15 అర్ధరాత్రి సమయంలో మాకు ఓ మెసేజ్ వచ్చింది. 38 గంటల్లో కార్గిల్ వైపు కదలాలని సూచన. మే 16 ఉదయం బయల్దేరాం. వాహనాల్లో మా ప్రయాణం. నాలుగు రోజుల సమయం పట్టింది. భారీ ఆయుధ సామగ్రితో ముందుకు కదిలాం. ద్రాస్ సెక్టార్‌కు చేరుకున్నాం. పర్వతం పైకి ఎలా వెళ్లాలో మాకు రూట్ మ్యాప్ ఇచ్చారు. 20 మంది చొప్పున బృందాలుగా పర్వతం పైకి ప్రయాణం. ఏకే 47, లైట్ మెషిన్ గన్, ఎంఎంజీ, మోర్టాల్స్ మా ఆయుధాలు. గుళ్ల వర్షం కురుస్తూనే ఉంది. వారం రోజుల అనంతరం కీలక ప్రాంతమైన టైగర్ హిల్స్‌కు చేరుకున్నాం. ఈ క్రమంలో జూలై 26వ తేదీన అర్ధరాత్రి వేళ మా కదలికలను గమనించిన శత్రుసైన్యం దాడి చేసింది. నా కుడి చేతికి తీవ్రగాయమైంది. పట్టుతప్పి పర్వతంపై నుంచి కిందికి జారిపడి స్పృహ కోల్పోయాను. బాంబుల మోత ఓ వైపు.. చిమ్మ చీకటి మరోవైపు.. వణికించే చలిలో గాయాల బాధ.. చాలా సేపటి తర్వాత కేకలు వేయడంతో.. ప్రథమ చికిత్స అనంతరం హెలికాప్టర్ శ్రీనగర్ బేస్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వారం రోజులు తర్వాత.. అక్కడ రద్దీ పెరగడంతో ఢిల్లీలోని ఆర్ఆర్ ఆస్పత్రికి.. అక్కడ్నుంచి విశాఖలో ఉన్న ఐఎస్‌హెచ్ కల్యాణికి తరలించారు. 20 రోజుల మెరుగైన చికిత్స అనంతరం స్వగ్రామానికి చేరుకున్నాను. అనంతరం మళ్లీ విధుల్లో చేరాను. ఆపరేషన్ విజయ్‌లో ఓపీ స్టార్, ఓపీ విజయ్, ఓపీ రక్షక్, వుండెడ్ మెడల్స్‌ను ప్రభుత్వం నాకు అందించింది. 1991 జూలై 26న విధుల్లో చేరగా.. 2015 జూలై 26న సైన్యం నుంచి రిటైర్ అయ్యాను. నేటి యువతకు దేశ రక్షణ విధులు ఎంత అవసరమో అవగాహన కల్పిస్తూ ఔత్సాహికులకు శిక్షణ ఇస్తున్నాను.

సైనికుల త్యాగాలు వెలకట్టలేనివి



రక్తదానం చేస్తున్న మాజీ సైనికులు

సైనికుల త్యాగాలు వెలకట్టలేనివని వక్తలు అన్నారు. కార్గిల్ విజయ దివస్‌ను పురస్కరించుకొని జిల్లా ఎక్స్ సర్వీస్ మెన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కిమ్స్ ఆస్పత్రి సహకారంతో మహా రక్తదాన శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 25వసారి రక్తదానం చేసిన విజయనగరానికి చెందిన మాజీ సైనిక ఉద్యోగి పి.మన్మధరావును జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, మాజీ సైనికుల వెల్ఫేర్ అధికారి ఎ.శైలజ, మాజీ సైనికుల సంక్షేమ సంఘం చైర్మన్ పి.ఈశ్వరరావు, ఆధ్యక్షులు పూర్ణచంద్రరావు కటకం, బి.సూర్యనారాయణ, పి.మురళీధరరావు, సీహెచ్ రామారావు, విశ్రాంత కల్నల్ మెండ నారాయణరావు, పి.చంద్రశేఖరరావు, జె.జె.రావు పాల్గొన్నారు.

–శ్రీకాకుళం కల్చరల్

కార్గిల్ విజయం దేశానికి గర్వకారణం..



కార్గిల్ విజయం దేశానికి గర్వకారణం. ఆ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలనే ఏటా కార్గిల్ విజయ దివస్ నిర్వహించుకుంటున్నాం. జిల్లా నుంచి సుమారు 300 మంది యుద్ధంలో పాల్గొనగా.. మోహనరావు వీరమరణం పొందారు. యుద్ధంలో పాల్గొన్న వారిలో నీలాచలం, సింహాచలం క్షతగాత్రులయ్యారు. వీరికి ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహం అందిస్తోంది.

– ఎ.శైలజ, జిల్లా సైనిక సంక్షేమాధికారి, శ్రీకాకుళం

క్లుప్తంగా

సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

మెళియాపుట్టి: స్థానిక సచివాలయ ఉద్యోగులు చేసిన తప్పిదానికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీఓ నరసింహప్రసాద్ పండా తెలిపారు. మండల కేంద్రానికి చెందిన మూగి భాస్కరరావు, కృష్ణవేణిల ఇద్దరు కుమారులు మూగి మోక్షిత్, మూగి షారుఖ్‌లు సచివాలయ ఉద్యోగుల తప్పిదం కారణంగా తల్లికి వందనం పథకానికి అనర్హులయ్యారు. హౌస్ హోల్డ్ సర్వేలో అధికారులు వారిద్దరూ చనిపోయినట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో వారికి నగదు అందలేదు. దీనిపై తల్లిదండ్రులు జేసీకి ఫిర్యాదు చేయడంతో ఆయన ఆదేశానుసారం వెల్ఫేర్ అసిస్టెంట్, కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు ఎంపీడీఓ తెలిపారు.

జీడి రైతుకు సత్కారం



సత్కారం పొందుతున్న అక్కుపల్లి రైతు యంపల్లి నారాయణ

కాశీబుగ్గ: వన్ డిస్ట్రిక్ వన్ ప్రొడక్టు (ఓడీఓపీ) కార్యక్రమానికి జిల్లా పలాస జీడిపప్పు ఎంపికైన సందర్భంగా.. పారిశ్రామిక వేత్తలతో పాటు వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి గ్రామానికి చెందిన రైతు యంపల్లి నారాయణను సత్కరించారు. ఆలిండియా కాష్యూ అసోసియేషన్ చెన్నై మహాబలిపురంలో శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ కాష్యూ మాన్యుఫ్యాక్చర్ అసోసియేషన్ ఆహ్వానం మేరకు రైతు వెళ్లారు. పలాస పరిసర ప్రాంతంలో ఉద్దానంలో రైతులు పండించిన జీడి పంట కారణంగా పేరుప్రఖ్యాతలు వచ్చాయని ఏపీసీఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లా కాంతారావు తెలిపారు.

అబ్బాయిపేటలో చోరీ

జలుమూరు: జోనంకి పంచాయతీ అబ్బాయిపేటకు చెందిన ఉప్పాడ నరసమ్మ ఇంటిలో దొంగతనం జరిగింది. చోరీలో రూ.60వేల విలువైన బంగారం పోయినట్లు ఆమె తెలిపారు. పది రోజుల కిందట ఆమె హరిదాసుపురంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. శుక్రవారం ఉదయం తిరిగి వచ్చి చూసే సరికి బీరువా తెరిచి ఉంది. అందులో బంగారంతో పాటు కొన్ని వస్తువులు కనిపించలేదు. ఇంటి తలుపు తీసి బీరువా పగలగొట్టి లోపల లాకర్ తెరిచారని ఆమె తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



గోవిందరావు (ఫైల్)

రణస్థలం: రణస్థలంలోని ఓ ఇంటికి స్లాబ్ ఇనుప రాడ్లు కడుతున్న సమయంలో విద్యుత్ తీగలు తగలడంతో కె.గోవిందరావు(48) అనే వ్యక్తి మృతి చెందాడు. జేఆర్ పురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలంలోని జోగిరాజుపేట గ్రామానికి చెందిన గోవిందరావు స్లాబ్ పనికి రాడ్లు కట్టేందుకు శుక్రవారం ఉదయం 8.15 గంటలకు రణస్థలం వచ్చారు. స్లాబ్‌పై పని చేస్తున్న సమయంలో విద్యుత్ తీగలు తగలడంతో చలనం లేకుండా పడిపోయారు. తోటి కార్మికులు గుర్తించి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించినా అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు. జేఆర్ పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

దారి ఖర్చులు ఇవ్వలేరా..?

రాకరాక వచ్చిన వానలు దారుల దారుణ రూపాలను బయటపెట్టాయి. గిరిజన గ్రామాలు, చిన్న చిన్న పల్లెలను కలిపే రహదారులు చిన్నపాటి చినుకులకే చిత్తడిగా మారిపోయాయి. ఇక పెద్ద వర్షాలు పడితే తమ గతేమవుతుందని ఆయా ప్రాంతాల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వానలు రాక ముందే వీటిని బాగు చేసి ఉంటే తమకు ఈ అవస్థ తప్పేదని అంటున్నారు.



సరుబుజ్జిలి: ఆమదాలవలస మండలం పొన్నాంపేట వద్ద రహదారి



కాశీబుగ్గ : నడవడానికి అధ్వానంగా కోరాలింగుతాళ్లభద్ర రోడ్డు



జి.సిగడాం: మ్యాప్‌ను తలపిస్తున్న జి.సిగడాంకు వెళ్లే దారి

'హైస్కూల్ ప్లస్'.. అమలు మైనస్

- హైస్కూల్ ప్లస్ కళాశాలలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి
- వెంటాడుతున్న అధ్యాపకుల కొరత
- కానరాని మౌలిక సదుపాయాలు
- ఆందోళన చెందుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు



ఉర్లాం ప్లస్ టూ కళాశాలలో విద్యార్థినులు

నరసన్నపేట:

గ్రామీణ ప్రాంతాల్లోని బడుగు, బలహీన వర్గాలకు చెందిన అమ్మాయిలకు ఉన్నత విద్యను అందించేందుకు గత ప్రభుత్వం హైస్కూల్ ప్లస్‌లను ప్రవేశ పెట్టింది. జాతీయ విద్యావిధానంలో భాగంగా 2022 విద్యా సంవత్సరం నుంచి హైస్కూల్ ప్లస్ అమలు చేస్తున్నారు. దీంతో రూరల్ ప్రాంతాల్లోని బాలికలకు ఇంటర్ అందుబాటులోకి వచ్చింది. జిల్లాలో నరసన్నపేట మండలం ఉర్లాం, టెక్కలి (బాలికోన్నత పాఠశాల), వజ్రపుకొత్తూరు, మందస మండలం హరిపురం, సరుబుజ్జిలి మండలం రొట్టవలస, పలాస మండలం బ్రాహ్మణతర్లాలో వీటిని ఏర్పాటు చేశారు. మొదటి సంవత్సరం ప్రవేశాలు అంతంతగానే ఉన్నా తర్వాత సంవత్సరం బాగా పెరిగాయి. ఆయా ప్రాంత బాలికల తల్లిదండ్రులు ఎంతగానో సంతోషించారు. చెంతనే 6 వ తరగతి నుంచి ఇంటర్ వరకూ విద్యా బోధన లభిస్తుండటంపై ఆనందం వ్యక్తం చేశారు. సబ్జెక్టులకు అవసరమైన అధ్యాపకులను అప్పటి ప్రభుత్వం కేటాయించింది. అంతా సవ్యంగా సాగుతున్న నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఈ హైస్కూల్ ప్లస్ విద్యపై శీత కన్ను వేసింది. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి ఫలితంగా ప్లస్ టూ కళాశాలల్లో అడ్మిషన్లు తగ్గుతున్నాయి. వీటిని ఎత్తివేసేందుకే కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందనే వదంతులు వినిపిస్తున్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

వెంటాడుతున్న అధ్యాపకుల కొరత

హైస్కూల్ ప్లస్‌టూ కళాశాలల్లో బైపీసీ, ఎంపీసీ గ్రూపులు నిర్వహిస్తున్నారు. ఒక్కో గ్రూపునకు 40 సీట్లు చొప్పున ఒక్కో విద్యా సంవత్సరంలో 80 సీట్లు అందుబాటులో ఉన్నాయి. జిల్లాలో 6 హైస్కూల్స్‌లో ప్లస్ టూ కళాశాలల్లో కోర్సులు నిర్వహిస్తున్నారు. ఒక్క టెక్కలి తప్ప మిగిలిన ప్లస్ టూ కళాశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు అంత ఆశాజనకంగా లేవు. దీనికి కూటమి ప్రభుత్వం ద్వంద్వ వైఖరే కారణమని విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక్కో ప్లస్ టూ కళాశాలలో ఏడుగురు లెక్చరర్లు ఉండాలి. జిల్లాలో టెక్కలి, వజ్రపుకొత్తూరుల్లో తప్ప మిగిలిన చోట్ల అధ్యాపకులు పూర్తి స్థాయిలో లేరు. ఉర్లాంలో బోటనీ, తెలుగు, ఇంగ్లిష్‌లకు పూర్తి స్థాయిలో అధ్యాపకులు ఉండగా కెమిస్ట్రీ సబ్జెక్టును లుకలాం స్కూల్ నుంచి ఒక టీచర్ వచ్చి బోధిస్తున్నారు. మిగిలిన ఫిజిక్స్, లెక్కలు, జువాలజీ అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే రొట్టవలసలో కూడా నాలుగు సబ్జెక్టులకు అధ్యాపకులు లేరు. హరిపురంలో లెక్కలు, జువాలజీ సబ్జెక్టులకు అధ్యాపకులు లేరు.

మెరుగు పడని వసతులు..

ప్లస్ టూ కళాశాలల్లో వసతులు అంతంతమాత్రంగానే ఉన్నాయి. సైన్స్ విద్యార్థులు ప్రాక్టికల్స్ చేసుకునేందుకు తగిన సదుపాయాలు లేవు. తరగతి గదుల కొరత అధికంగా ఉంది. అలాగే ఆఫీస్ వర్క్ చేసేందుకు తగిన సిబ్బంది కొరత ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎలాంటి సదుపాయాలు మెరుగు పడలేదు. ఉర్లాంలో ఇరుకు గదుల్లోనే తరగతులు నిర్వహిస్తున్నారు. ఇదే పరిస్థితి రొట్టవలస, బ్రాహ్మణతర్లాలో కూడా ఉంది. అన్ని చోట్ల ప్రాక్టికల్స్ ల్యాబ్స్ లేవు. వసతులు మెరుగు పరచాలని, ఈ కళాశాలలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి అదనపు నిధులు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



ఉర్లాం ప్లస్ టూ కళాశాల

సౌకర్యాలు కావాలి



ఉర్లాం ప్రాంతానికి జూనియర్ కళాశాల కావాలని ఎప్పటి నుంచో కోరుతున్నాం. ధర్మాన కృష్ణదాస్ కృషి వల్ల గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మంచి ఆలోచనా విధానం వలన ఉర్లాం హైస్కూల్లో రెండేళ్ల కిందట ఇంటర్ తరగతుల నిర్వహణకు అవకాశం ఇచ్చారు. మా ప్రాంతం వాళ్లు ఆనందించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం దీన్ని నిర్వీర్యం చేయడానికి చూస్తోంది. ప్రభుత్వం వచ్చి ఏడాది దాటుతున్నా వసతులు మెరుగు పరచలేదు.

– పోలాకి నర్సింహమూర్తి, సర్పంచ్ ఉర్లాం

సౌకర్యాలు మెరుగు పరచాలి



గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ ప్లస్ టూ కళాశాలల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో బాలికలకు ఇంటర్ విద్య అందుబాటులోకి వచ్చింది. కానీ దీనిపై కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోంది. అధ్యాపకులను నియమించకుండా తాత్సారం చేస్తోంది. గత ప్రభుత్వం అమలులోనికి తెచ్చిన ఈ ప్లస్ టూ కళాశాలలను పటిష్టం చేయాలి.

– తమ్మినాన చందనరావు, ఏపీఎస్‌టీపీ జిల్లా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

సురేఖా పాణిగ్రాహికి అంతిమ వీడ్కోలు



సురేఖా పాణిగ్రాహి అంతిమ యాత్ర

పలాస: ప్రముఖ విప్లవ కవి, శ్రీకాకుళం గిరిజన రైతాంగ సాయుధపోరాట నిర్మాతల్లో ఒకరైన సుబ్బారావు పాణిగ్రాహి సతీమణి సురేఖా పాణిగ్రాహి (87)కి శుక్రవారం ఉదయం పలాస మండలం బొడ్డపాడులో అంతిమ యాత్ర జరిగింది. ముందుగా బొడ్డపాడు కాలనీ నుంచి బొడ్డపాడు గ్రామ అమరవీరుల స్మారక మందిరం వద్దకు మృతదేహాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చారు. బంధువులు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజాసంఘాల నాయకులు, విప్లవ కారులు, అభిమానులు పెద్ద ఎత్తున జోహార్లు అర్పించారు. అనంతరం అమరుల బంధుమిత్రుల సంఘం నాయకుడు తామాడ త్రిలోచనరావు అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ సురేఖా పాణిగ్రాహి మృతి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం బొడ్డపాడు శ్మశాన వాటిక వద్ద ప్రజాకళామండలి, అరుణోదయ కళాకారుల పాటల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు.

టంకాలదిగ్గువలసలో పారిశుద్ధ్య పనులు

జి.సిగడాం: టంకాల దిగ్గువలస గ్రామంలో శుక్రవారం ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఎంపీడీఓ గుంటముక్కల రామకృష్ణారావు, కార్యదర్శి అసిరయ్య ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. దోమల నివారణకు మందులు పిచికారీ చేశారు. తాగునీటి బావులు, బోర్లలో క్లోరినేషన్ చేశారు. జిల్లా మలేరియా అధికారి సత్యనారాయణ, వైద్యాధికారులు బుడుమూరు యశ్వంత్, పేకల సుమబిందు వైద్య సిబ్బంది కలిసి ఇంటింటికి వెళ్లి వ్యాధులపై సర్వే చేపట్టారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ టంకాల జగన్‌మోహిని టంకాల రామకృష్ణంనాయుడు, ఎంఎల్‌హెచ్‌పీ దివ్యరాజేశ్వరి, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

'న్యాయవాదులకు రక్షణ చట్టం చేయాలి'



కోర్టు గేట్ వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం న్యాయవాదుల రక్షణ చట్టం చేయాలని శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్, ఆంధ్రప్రదేశ్ బీసీ న్యాయవాదుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకాకుళం జిల్లా కోర్టు మెయిన్ గేటు వద్ద నిరసన తెలిపారు. న్యాయవాదుల రక్షణ చట్టం చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చాలా ఏళ్లుగా నిర్లక్ష్యం చేస్తున్నాయని అన్నారు. న్యాయవాదుల మరణం తర్వాత వారి వారసులకు చెల్లించే పరిహారం రూ.పది లక్షలకు పెంచాలని, ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.పది వేలు ఇవ్వాలని కోరారు. విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు



పూండి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూండి వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉద్దానం గోపినాథపురానికి చెందిన దున్న హేమారావు, మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. పూండి నుంచి పలాస వైపు పాఠశాలలకు చెందిన పుస్తకాల లోడుతో వెళుతున్న శ్రీకాకుళానికి చెందిన వ్యాన్ పలాస నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న హేమారావును బలంగా ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ద్విచక్రవాహనం ధ్వంసం కాగా వెనుక ఉన్న మహిళకు తీవ్ర గాయాలై కాలు విరిగిపోయింది. వాహనం నడుపుతున్న హేమరావుకు తలకు, ఇతర చోట్ల బలమైన గాయాలయ్యాయి. స్థానికులు అక్కడకు చేరుకుని 108 వాహనానికి సమాచారం అందించి హుటాహుటిన పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రులను శ్రీకాకుళం తీసుకెళ్లారు. వజ్రపుకొత్తూరు పోలీసులు సమాచారం అందడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆస్పత్రికి చేరుకుని వివరాలు సేకరించారు.



కవిటి: బొరివంక నుంచి 108 లో సోంపేట క్షతగాత్రుల్ని తరలిస్తున్న దృశ్యం

సినిమాకు వెళ్లి వస్తుండగా..

కవిటి: సోంపేటలో 'హరిహర వీరమల్లు' సినిమా చూసి తిరిగి వస్తుండగా ముగ్గురు యువకులు రోడ్డు ప్రమాదానికి గురై గాయపడ్డారు. కవిటి మండలంలోని బొరివంక వద్ద గురువారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి శుక్రవారం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వి.రవివర్మ విలేకరులకు తెలిపారు. కవిటి మండలం కపాసుకుద్దికి చెందిన కర్రి మేఘనాథం, కర్రి జోగారావు, వంక రాజులు గురువారం సినిమా చూద్దామని ముగ్గురూ ఒకే బైక్‌పై సోంపేట వెళ్లారు. సినిమా చూసి తిరిగి వస్తుండగా తలతంపర వద్ద ఒకరిని ఢీకొన్నట్లు స్థానికులు తెలిపారు. అక్కడ గొడవ జరుగుతుందేమోనన్న భయంతో వాహనాన్ని వేగంగా నడుపుతూ బొరివంక వద్ద స్పీడ్‌బ్రేకర్‌ను తప్పించే ప్రయత్నంలో పక్కన ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్నారు. స్థానికులు అంబులెన్స్‌కు సాయంతో సోంపేట ఆస్పత్రికి తరలించారు.

దశాబ్దాల శోకం..



ఇలాంటి దృశ్యాలు ఉద్దానానికి కొత్త కాదు. దశాబ్దాలుగా రుద్రభూమి చుట్టూ పల్లెలు తిరుగుతూనే ఉన్నాయి. తరాలకు తరాలు శోకాన్ని అనుభవిస్తూనే ఉన్నాయి. అయినా వేదన వీడడం లేదు. ఇక్కడ అంత్యక్రియలు చేస్తున్న అమ్మాయి పేరు ఇందు. ఈమె తల్లి లక్ష్మి కిడ్నీ వ్యాధి బాధితురాలు. పది రోజుల కిందట ఆమె చనిపోయారు. భార్య మరణాన్ని భరించలేక భర్త రాజు శుక్రవారం మనస్తాపంతో ప్రాణాలు వదిలేశారు. దీంతో ఇందు ఒంటరైపోయింది. తండ్రి అంత్యక్రియలను తన చేతులమీదుగానే జరిపించింది. కిడ్నీ వ్యాధి బలి తీసుకున్న ఇలాంటి కుటుంబాలు ఉద్దానంలో అడుగడుగునా కనిపిస్తాయి.

– వజ్రపుకొత్తూరు రూరల్

అథ్లెటిక్స్ సమరానికి వేళాయె

- రేపు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక పోటీలు
- ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు రాష్ట్రపోటీలకు ఎంపిక



శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు ఈనెల 27వ తేదీన జరగనున్నాయి. శ్రీకాకుళంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్) కళాశాల మైదానం వేదికగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఈ ఎంపికల ప్రక్రియ మొదలుకానుంది. అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా చైర్మన్ కొన్న వెంకటేశ్వరావు(వాసు) సూచనల మేరకు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొన్న మధుసూదనరావు, ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి నేతృత్వంలో జిల్లా సంఘ ప్రతినిధులు, పీడీ, పీఈటీలు ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు.


నాలుగు వయో విభాగాల్లో పోరు..

సౌత్‌జోన్ నేషనల్స్‌లో పాల్గొనే అథ్లెటిక్స్ క్రీడా కారుల ఎంపికలు మొత్తం నాలుగు వయో విభాగాల్లో చేపట్టనున్నారు. అండర్-14, 16, 18, 20 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా 100 మీటర్ల పరుగుపందాలు, హర్డిల్స్, 200 400, 800, 1000, 2వేలు, 3వేలు, 5వేల మీటర్ల పరుగు పందాలు, నడక, లాంగ్‌జంప్, హైజంప్, ట్రిపుల్‌జంప్, షాట్‌పుట్, జావెలిన్ త్రో, హేమర్‌త్రో, పోల్‌వాల్ట్ తదితర అథ్లెటిక్స్ ఈవెంట్స్‌లో పోటీలు నిర్వహించి అందులో రాణించిన క్రీడాకారులను రాష్ట్రపోటీలకు ఎంపిక చేయనున్నారు.

ఇక్కడ రాణిస్తే రాష్ట్ర పోటీలకు..

ఏపీ జూనియర్ స్టేట్‌మీట్(అంతర్‌జిల్లాల) అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2025 పోటీలు బాపట్ల జిల్లా (చీరాల) వేదికగా ఆగస్టు 9 నుంచి 11వ తేదీ వరకు జరగనున్నాయి. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానం వేదికగా ఇక్కడ జరిగే ఎంపికల్లో రాణించిన అథ్లెట్లను బాపట్లలో జరిగే రాష్ట్ర పోటీలకు ఎంపిక చేయనున్నారు. అక్కడ మూడు రోజులపాటు పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు పతకాలు, ప్రశంసా పత్రాలను అందజేస్తారు. గోల్డ్ మెడల్స్ సాధించిన క్రీడాకారులు సౌత్‌జోన్ నేషనల్స్‌కు నేరుగా అర్హత సాధించనున్నారు. పుదుచ్చేరి వేదికగా సెప్టెంబర్ 9 నుంచి 11వ తేదీ వరకు సౌత్‌జోన్ జూనియర్ నేషనల్స్ జరగనున్నాయి. క్రీడాకారులు వివరాల కోసం సంఘ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కె.మాధవరావు (9346903771)ను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.


సద్వినియోగం చేసుకోవాలి



సౌత్‌జోన్ మీట్ షెడ్యూల్ వెలువడింది. 27న శ్రీకాకుళంలో జరిగే జిల్లాస్థాయి ఎంపికల్లో పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. తమ ప్రతిభను నిరూపించుకోవాలి.

– కొన్న మధుసూదనరావు, అథ్లెటిక్స్ అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు

ప్రతిభే ఆధారంగా..



క్రీడాకారుల ప్రతిభే ఆధారంగా ఎంపికలను నిర్వహిస్తాం. ఇక్కడ రాణించిన బాలబాలికలను బాపట్లలో జరిగే స్టేట్‌మీట్‌కు ఎంపిక చేస్తాం. అక్కడ రాణిస్తే సౌత్‌జోన్ నేషనల్స్‌కు నేరుగా అర్హత సాధిస్తారు.

– మెంటాడ సాంబమూర్తి, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

మౌలిక వసతులపై దృష్టి పెట్టండి: కలెక్టర్



డార్మిటరీ పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

బూర్జ: విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడంపై దృష్టి సారించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. మండలంలో గల కొల్లివలస డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం విద్యాలయంలో శుక్రవారం జిల్లాలోగల అన్ని హాస్టళ్ల అనుబంధ శాఖాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తాగునీరు, వసతులు, డార్మిటరీ గురించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కిటికీల వద్ద దోమ తెరలు అమర్చాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శాఖల వారీగా హాస్టల్ జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యాలయాల ఎస్ఎం పురం, వమ్మరవెల్లి కళాశాల ప్రిన్సిపాల్స్, కేజీబీవీ విద్యాలయాల ఏపీసీ ఎస్.శశిభూషణరావు, ఏపీ మోడల్ విద్యాలయాలు ఏడీ శ్రీనివాసరావు, డిప్యూటీ ఈఓ కె.విజయకుమారి, కన్వీనర్ బొడ్డేపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో ఐటీఐ పాసైన విద్యార్థులకు ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి జిల్లా ప్రజారవాణా అధికారి హనుమంతు అమరసింహుడు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 26 నుంచి ఆగస్టు నెల 9వ తేదీ లోపు www.apprenticeshipindia.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.